# నేలతల్లి పచ్చగా నవ్వింది

వంగర లక్ష్మీకాంత్



చాలాకాలంగా వానలు లేవు. ఎండలు మండిపోతున్నాయి. చెట్టు-చేమలన్నీ ఎండి పోయాయి. నేలంతా పెద్దపెద్ద నెర్లుగొట్టి నోళ్ళు తెరచింది. ప్రకృతంతా నల్లగా, కమురుకు పోయినట్లుగా కనిపిస్తున్నది.

ఎక్కడ చూచినా కరువు. అన్నిచోట్లా ఆకలి-హాహాకారాలు.

అప్పుడు ఒక పిచ్చుక మేతకోసం బయలు దేరింది. కరువంటే అదెరుగదు. కానీ దానికీ కరువొచ్చింది. ఎక్కడ వెతికినా చిన్న పురుగుకూడా కనిపించలా.

అదలా వెతుకుతూ, వెతుకుతూ ఒక నగరంలోకి ప్రవేశించింది. దానికంతా గజిబిజిగా ఉంది. ఆకాశంఎత్తు మేడలు. ఇరుకు గొందులు. ఎక్కడ ఎగరాలో, ఎక్కడ మేతకోసం వెతకాలో అర్థంకాలా. కంగారు పడింది. ఎగిరి ఎగిరి అలసిపోయింది. అక్కడే నిలబడి చుట్టూ కలియ చూసింది.

అక్కడ వెండి ఆభరణాలు తయారుచేసే దుకాణం ఒకటి ఉంది. అందులో పనిచేసే పిల్లవాడు గదంతా ఊడ్చి, దువ్వంతా ఎత్తి పొట్లం కట్టాడు. ఆదువ్వను కడిగితే నలుసంతన్నా వెండి రాక పోతుందా అని అతని ఆశ.

ఆ పొట్లం పిచ్చుక కంట్లో పడనే పడింది. అది ఆహారం అనుకుని ఎత్తుకుపోయింది. ఆ కుర్రవాడు వెంటపడ్డాడు. రివ్వున ఎగిరిపోయింది. పొట్లం విప్పి తిందామని ఒక గోడమీద వాలింది. అప్పుడు ఒక కాకి ఆ పొట్లాన్ని తన్నుకుపోయింది. ఆ కాకి అలా చాలా దూరం ఎగిరింది. భవనాలు దాటింది, నగరాన్ని దాటింది. ఎక్కడ వాలాలన్నా ఒక్క చెట్టుకూడా కనిపించలా. ఆకాకి అలా ఎగురుతూ వెళుతుంటే దాన్ని ఒక గ్రద్ద గమనించి వెంబడించింది. వెంబడించి, వెంబడించి ఆ పొట్లాన్ని గ్రద్ద తన్నుకుపోయింది. అది అలా చాలా దూరం పోయింది. చాలా ఎత్తుకు ఎగిరింది. ఎంత ఎత్తంటే క్రిందనుంచి పొట్లం కోసం వెంటబడి పైకి చూసే పిల్లగాడికి ఒక చుక్కలా కనిపించసాగింది.

ఆకాశంలో అప్పుడొక రాబందు రివ్వున దూసుకు వచ్చింది. అంతే ఆ పొట్లం దానికి సొంతం

అయ్యింది. అయినా గ్రద్ద విడువకుండా వెంటబడింది. రాబందు ముందు, గ్రద్ద వెనుక.

నేలపైనుండి చూస్తే ఒక పెద్ద చుక్క మరో చిన్న చుక్క పరిగెత్తుతున్నట్లుగా కనిపించసాగాయి.

ఉన్నట్టుండి రాబందు నుండి గ్రద్ద పొట్లం లాక్కుని ఎగరసాగింది. మళ్ళీ రాబందు వెంటబడింది. పొట్లాన్ని తన్నుకుపోయింది.

రాబందు ముందు, గ్రద్ద వెనుక. గ్రద్ద వేగంగా ఎగిరింది. రాబందునుండి పొట్లం లాగేసుకుంది. కాని పెనుగులాట జరిగింది. పొట్లం చినిగి పోయింది. చెరోకాస్త కాగితం ముక్క వచ్చింది. పొట్లంలోని దువ్వంతా అటుగా వెళ్ళే మేఘం మీద పడింది. అంతే మేఘంలోని నీటి ఆవిరి అణువులన్నీ దుమ్ముకణాల చుట్టూ చేరసాగాయి. అలా నీటి అణువులు ఒక చోటికి చేరి పెద్ద పెద్ద నీటి బిందువులు ఏర్పడసాగాయి. అవి బరువెక్కాయి. మేఘం నిండు గర్భిణిలాఅయ్యింది. టపటపమంటూచినుకు రాలటం మొదలయ్యింది. కుంభవృష్టిగా వాన పడింది.

పొట్లం కోసం వెంటపడ్డ పిల్లవాడు ముద్దగా తడిశాడు. వానలో ఆనందంగాగంతులు వేశాడు. నోరు తెరచిన నేలతల్లి నిండుగా నీరు తాగింది.

పిచ్చుక నేలమీద వాలి పురుగుల్ని ఏరు కుంటున్నది. గ్రద్ద, రాబందు, కాకి నేల బొరియల్లోంచి బయటికివచ్చే ఎలుకల్ని ఆర గిస్తున్నాయి. నేలతల్లి పచ్చగా నవ్వింది !. ★

# సభలు - సమావేశాలు

04-09-2005న ప్రకాశంజిల్లా చీమకుర్తి లో జరిగిన శతాధిక కవి సమ్మేళనం వేదికపై యువకవి చలపాక ప్రకాష్ రచన "చప్రలు" పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖకవి, సంత నూతల పాడు శాసనసభ్యులు శ్రీధార సాంబయ్య. చిత్రంలో ప్రముఖ సినీ రచయిత శ్రీ ఎం.వి.ఎస్. హరనాధరావు, కవి శ్రీ పొన్నూరు వేంకట శ్రీనివాసులు, ప్రకాశం జిల్లా రచయి తల సంఘం అధ్యక్షులు శ్రీ బి. హనుమారెడ్డి, రచయిత చలపాక ప్రకాష్





2005, సెప్టెంబర్ 11న, కాకినాడ, జిల్లా గ్రంథాలయ సంస్థ సభా మందిరంలో డా॥ అద్దేపల్లి సాహిత్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన డా॥ అద్దేపల్లి రామ మోహనరావు సప్తతి సభలో పాల్గొన్న వక్తలు మాకినీడి సూర్యభాస్కర్, వి. వెంకట నారాయణ, చిరంజీవి కుమారి, డా॥ అద్దేపల్లి, శిరీష, డి.రామా రావు, సోమయాజులు, పి.ఆర్. ఎల్.స్వామి, లక్ష్మీగణపతి శాస్త్రి.